

మాట్లాడుతున్న సీటీ రవి

నేనేమైనా ఉగ్రవాదినా..?

- అప్రమత్తంగా లేకపోతే ఎన్‌కౌంటర్ చేసేవారు
- నా గురించి తెలుసుకోండి...
- ప్రభుత్వంపై సీటీ రవి ఆగ్రహం

బెంగళూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'నేనేమైనా ఉగ్రవాదినా..' రెండు దశాబ్దాల రాజకీయంలో వ్యక్తిగతంగా ఎవరినీ కించపరచలేదు, సంస్థాగతంగా రాజకీయంగా మాత్రమే మాట్లాడుతా... అటువంటిది నన్ను టార్గెట్ చేసి చిత్రహింసలకు గురిచేశారని బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బెళగావి నుంచి బెంగళూరు కోర్టుకు తరలిస్తుండగా దావణగెరె సమీపానికి చేరేసరికే హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో పోలీసులు విడుదల చేశారు. అనంతరం సీటీ రవి, ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రలతో కలసి మీడియాతో మాట్లాడారు. తనగురించి చిక్కమగళూరులో తెలుసుకోవాలన్నారు. తనను విమర్శించే మంత్రులు, డీసీఎం కూడా తన వ్యవహార శైలి గురించి తెలుసుకోవాలన్నారు. కాగా సువర్ణసౌధలోనే డీసీఎం డీకే శివకుమార్, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌లు ప్రాణాలు తీస్తామని హెచ్చరించారన్నారు. తాను ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పోలీసులు ఎన్‌కౌంటర్ చేసేవారని ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని బెళగావి ఐదో జేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయమూర్తి వద్ద వివరించానన్నారు. సువర్ణసౌధలోనే అరెస్టు చేశారని ఆ తర్వాత రాత్రంతా పలు పోలీస్ స్టేషన్‌లకు తిప్పారని న్యాయమూర్తికి వివరించానన్నారు. ఖానాపుర పోలీసులు తనను శారీరకంగా మానసికంగా హింసించారన్నారు. తన మొబైల్, వాచ్ లాగేసుకున్నారన్నారు. తనను ఎన్‌కౌంటర్ చేయాలని పథకం వేశారన్నారు. వారికి ప్రతి పదినిమిషాలకోసారి పోలీసులకు ఫోన్‌లు వస్తున్నాయని, ఎవరు మార్గదర్శకం చేస్తున్నారో తెలియదని, తన కుటుంబసభ్యులకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. సువర్ణసౌధలో తాను మంత్రి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయలేదన్నారు. కానీ సువర్ణసౌధలో మూడుసార్లు దాడి చేసినా ఫిర్యాదు చేస్తే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. ఓ ప్రజాప్రతినిధిగా తన పట్ల అనుచితంగా వ్యవహరించారన్నారు. ప్రతిపక్షనేతలు అశోక్, ఛలవాది నారాయణస్వామిలు తనను చూసేందుకు వస్తే రెండున్నరగంటలపాటు అవకాశం ఇవ్వలేదన్నారు. గురువారం మధ్యాహ్నం కారిడార్‌లో చిక్కమగళూరుకు నీ శవమే పోతుందని మంత్రి బెదరించారన్నారు. నిజంగా నాకు ప్రాణహాని ఉందని భయపడ్డానన్నారు. నన్ను మానసికంగా ఇబ్బంది పెట్టారని, చివరకు సవదత్తి సమీపంలోని క్రషర్ ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళ్లి ఎఫ్ఐఆర్ కాపీని పదినిమిషాలు చూపి లాగేసుకున్నారన్నారు. సీటీ రవి అరెస్టును ఖండిస్తూ అభిమానులు, కార్యకర్తలు చిక్కమగళూరులో బంద్ పాటించారు. బెళగావిలో ప్రతిపక్షనేత ఆధ్వర్యంలో నిరసన తెలపగా బెంగళూరు ఫ్రీడంపార్కులో బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు.

ఫ్రీడం పార్కులో బీజేపీ నాయకుల నిరసన



మహిళపట్ల ఇంత అనుచిత వ్యాఖ్యలా: మంత్రి హెబ్బాళ్కర్



సీటీ రవి కనీసం ఓ మహిళపట్ల ఎలా మాట్లాడాలనేది లేకుండా అనుచితంగా వ్యాఖ్యానించారని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ మండిపడ్డారు. బెళగావిలో మీడియాతో మాట్లాడిన ఆమె తానొక మహిళనని తల్లిగా, అక్క, అత్తగా పిలిపించుకునే కుటుంబంలో ఉన్నానని కానీ ఇప్పటివరకు ఇంత నీచమైన పదాలు వినలేదన్నారు. తన పట్ల ఒకే పదాన్ని పదే పదే అంటున్నా బీజేపీ నాయకులు ఎవ్వరూ అడ్డు చెప్పలేదని కాంగ్రెస్‌వారు మాత్రమే తనకు అండగా వచ్చారన్నారు. సీటీ రవిని హంతకుడని వ్యాఖ్యానించింది వాస్తవమేనన్నారు.

మహిళలను బీజేపీ అవమానిస్తోంది: సీఎం

సీటీ రవిని వెనకేసుకొచ్చి నిరసనలు చేపట్టడం ద్వారా మహిళలను బీజేపీ అవమానిస్తోందని సీఎం సిద్దరామయ్య ఆరోపించారు. అటువంటి వ్యాఖ్యలు చేయడం తప్పు చేసినట్లేనని సీఎం మండ్యలో అభిప్రాయపడ్డారు. కాగా డీసీఎం డీకే శివకుమార్ బెళగావిలో మాట్లాడుతూ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ నియోజకవర్గంలోనే అనుచితంగా మాట్లాడితే వారి అభిమానులకు కోపం రాదా అన్నారు. చిక్కమగళూరులోనే కాకుండా దేశమంతటా బీజేపీ సీటీ రవికి మద్దతుగా నిరసనలు చేసుకోవచ్చునని ఎద్దేవా చేశారు. సీటీ రవి ఆమె నియోజకవర్గం నుంచి బయటపడడమే గొప్ప అన్నారు. చిక్కమగళూరులో ఇటువంటి సంస్కృతి ఉంటుందా? ఇతడి నోరు ఎప్పుడూ ఇలాగే ఉంటుందన్నారు.

స్టేషన్లు మార్చాం: పోలీస్ కమిషనర్

ఎమ్మెల్సీ సీటీ రవి అరెస్టు తర్వాత కొనసాగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వివిధ స్టేషన్లకు మళ్లించాల్సి వచ్చిందని బెళగావి నగర పోలీస్ కమిషనర్ ఎడా మార్టిన్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిచోటా ప్రజలు గుంపులుగా వస్తుండడంతో ఒత్తిడిని తప్పించుకునేందుకు ఆయనను వివిధ స్టేషన్లు మార్చామన్నారు. సువర్ణసౌధ నుంచి హిరేబాగేవాడి స్టేషన్‌కు, అక్కడ నుంచి ఖానాపురకు, ఆ తర్వాత నందగుడ, చన్నమ్మన కిత్తూరు, దొడ్డవాడ, బెళవాడి, సవదత్తి, ఎరగట్టి, రామదుర్గ, గోకాక్ తాలూకా అంకలగి నుంచి మళ్లీ బెళగావి తాలూకా ముతక గ్రామాలమీదుగా తీసుకొచ్చామన్నారు. రామదుర్గ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు జరిపించాకే కోర్టుకు తీసుకెళ్లామని అన్నారు.



వేదికపై సమ్మేళనాధ్యక్షుడు గొ.రు.చన్నబసప్ప, ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితరులు

పాలన కన్నడమయం కావాలి

- ప్రభుత్వ వ్యవహారాలన్నీ మన భాషలోనే
- కన్నడ సాహిత్య సమ్మేళనంలో సీఎం సిద్దరామయ్య



సమ్మేళనాధ్యక్షుడు గొ.రు.చన్నబసప్ప ఊరేగింపు

బెంగళూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాష మనుగడ సాధించాలంటే ప్రతి వ్యక్తి ఇంటా బయటా కన్నడలోనే మాట్లాడాలని అప్పుడే భాషా వికాసం సాధ్యమని సీఎం సిద్దరామయ్య అన్నారు. 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం మండ్యలో శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య కన్నడ అభిమానులు, సాహితీవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కన్నడ సంస్కృతిని ఆరోగ్యకరంగా భావితరాలకు అందించాలని, ఎంతోమంది మహనీయులు జీవితకాలం కన్నడ అభివృద్ధికి పోరాడారన్నారు. నాల్వడి కృష్ణరాజ ఒడయార్ కేఆర్ఎస్ డ్యామ్‌ను కట్టారన్నారు. ఆధునిక మండ్య నిర్మాణంలో మైసూరు రాజులు, శ్రీరంగపట్టణ నిర్మాణంలో హైదర్, టిప్పులను మరువలేమన్నారు. మండ్య జిల్లా స్వచ్ఛమైన కన్నడిగులు నివసించే ప్రాంతం అన్నారు. భాష, సంస్కృతి వికాసానికి జిల్లా పేరొందిందన్నారు. పదో శతాబ్దంనుంచి ఇక్కడ కన్నడ సంస్కృతి ప్రారంభమైందన్నారు. కావేరి నదీ తీరంలోని మండ్య జిల్లాలో కావేరి, హేమావతి, శింషా, లోకపావణి వంటి నదులు ప్రవహిస్తాయన్నారు. కన్నడ సాహిత్య పరంపరకు పేరొందిందన్నారు. వరి ఖనిజమని, చక్కెర నాడుగా మండ్య పేరొందిందన్నారు. మండ్య జిల్లా సాహిత్య సంస్కృతి శ్రేష్ఠమైనదన్నారు. సుదీర్ఘకాలం తర్వాత మండ్యలో అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం జరుగుతోందని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి దేవరాజ్ అరసు మైసూరు రాష్ట్రాన్ని 'కర్ణాటక'గా నామకరణం చేశారని, 50ఏళ్లు పూర్తైన సందర్భంగా సువర్ణ సంబరాన్ని ఆడంబరంగా జరుపుతున్నామన్నారు. ఏడాదిపాటు ప్రత్యేక కార్యక్రమాలు, జ్యోతి రథాల ఊరేగింపు జరుపుతున్నామన్నారు. భాష మనుగడకు అందరూ మాట్లాడడంతోనే సాధ్యమన్నారు. కన్నడ కళలు, జానపదం, భాషతోపాటు నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సాహిత్య సమ్మేళనం వేదికగా సాగుతోందని కొనియాడారు. కన్నడనేలలో కన్నడ భాషయే సార్వభౌమమన్నారు. ఇతరులను కన్నడలో మాట్లాడాలని వారికి భాష నేర్పాలన్నారు. గాంధీ గ్రామంలో సమాజశిక్షణ పొందిన గొ.రు.చన్నబసప్ప భూదాన ఉద్యమం, వయోజన విద్య, సేవాదళ్‌తోపాటు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో కేంద్ర కార్యాలయంలో కమిషనర్‌గా సేవలందించారన్నారు. జానపద జగత్తు, పంచాయతీరాజ్య, కన్నడ సాహిత్య పరిషత్ పత్రికలకు సంపాదకులుగా సేవలందించారన్నారు. అఖిల కర్ణాటక జానపద సమ్మేళనం తరికెరెలో జరిపిన ఘనత కూడా ఆయనదే అన్నారు. ఆయన సారథ్యంలో సమ్మేళనం జరపడం సంతోషంగా ఉందన్నారు. మనం జీవిస్తున్న ప్రస్తుత కాలం అత్యంత విషమంగా ఉందని, ద్వేషం, హింస మనుష్యుల మధ్య చిచ్చుకు కారణమవుతోందన్నారు. ప్రపంచీకరణ ప్రక్రియ ప్రారంభమయ్యాక జనజీవనంలో మార్పులు వచ్చాయన్నారు. ప్రపంచంలోని మహత్తరమైన రచనలు కన్నడలోకి అనువాదం చేయడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించే ప్రక్రియ జరగాల్సి ఉందన్నారు. ఇటీవలే కన్నడ రాజ్యోత్సవాలు జరిపామని, పాలనలో భాష వాడకానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మంత్రివర్గ నిర్ణయాలు, నోటీసులతోపాటు విధానసౌధలో అన్నింటినీ కన్నడలోనే అమలు చేస్తున్నామన్నారు. కన్నడను విస్తరించేందుకు సమగ్ర కన్నడ భాష వినియోగచట్టం తీసుకొచ్చామన్నారు. కన్నడ సంస్కృతి శాఖకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. విధానసౌధ ప్రాంగణంలో 25 అడుగుల నాడదేవి భువనేశ్వరి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కర్ణాటక మరునామకరణం చేసిన దేవరాజ్ అరసు విగ్రహాన్ని మైసూరులో ఏర్పాటు చేస్తామన్నారు. సువర్ణ సంబరంలో వందమంది సాధకులకు గౌరవించామన్నారు. కర్ణాటకకు జరుగుతున్న అన్యాయంపైనా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచే కేంద్రానికి అధిక పన్నులు వెళ్తున్నాయని అయితే అక్కడనుంచి వచ్చే గ్రాంట్లు చాలా తక్కువని, ఈ అన్యాయాన్ని ప్రశ్నించామన్నారు. మండ్యలో కొన్ని శక్తులు హింసను ప్రేరేపించేలా ప్రయత్నాస్తున్నాయని అందుకు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కులమత బేధాభిప్రాయాలు లేకుండా సమైక్యంగా జీవించే విధానం పాటిద్దామని పిలుపునిచ్చారు.





కన్నడ పతాకంతో విద్యార్థులు

అంగరంగ వైభవంగా ప్రారంభం

కన్నడ సాహిత్య సమ్మేళనం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపైకి సమ్మేళనాధ్యక్షుడు గొ రు చన్నబసప్పను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాడోజ మహేశ్‌జోషిలు సాదరంగా అధిరోహింపచేశారు. వందలాది కళాబృందాలు ముందు కదలగా రోడ్డుకు ఇరువైపులా విద్యార్థులు కన్నడ జెండాలతో స్వాగతించారు. మండ్య జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి ప్రజలు తరలివచ్చారు. సమ్మేళనం ప్రాంగణంలో కన్నడ పతాకాన్ని ఆవిష్కరించడం ద్వారా 87వ కన్నడ సాహిత్య సమ్మేళనానికి శ్రీకారం చుట్టారు. సమ్మేళనంలో వందలాది స్టాల్స్ ఏర్పాటు కాగా రాష్ట్రంలోని నలుమూలల నుంచి సాహిత్య కన్నడ అభిమానులు తరలివచ్చారు. 5వేదికల ద్వారా చర్చాగోష్ఠులు సాగాయి. వివిధ ప్రచురణా సంస్థలు రాయితీధరలతో పుస్తకాలను విక్రయించారు. తొలిరోజున మధ్యాహ్నం దాకా జనం సందడి అనిపించకపోయినా తర్వాత క్రిక్కిరిసి కనిపించారు.

కొట్టొచ్చిన వ్యవసాయ సంస్కృతి


మండ్య అంటేనే గుర్తుకొచ్చేది వ్యవసాయ జీవనాధారం. అందుకు అనుగుణంగానే సమ్మేళనంలో కొట్టొచ్చినట్టుగా సాగు సంస్కృతిని చాటారు. ప్రతిచోటా కాడెద్దుల నమూనాలు, అలంకరణలు చేశారు. సమ్మేళనంలో చెరుకు కోత, బెల్లం తయారీని ప్రయోగాత్మకంగా చూపడం అన్నివర్గాలను ఆకట్టుకుంటోంది. మండ్య జిల్లాలోని ప్రతిష్టాత్మకమైన మేలుకోటె, తెరెకరూరు, శ్రీరంగపట్టణ, కేఆర్ఎస్ ప్రాజెక్టుల రూపాలు ఆకర్షణీయం అనిపించాయి. సాహిత్య సమ్మేళనంలో సాహితీవేత్తలు రచయితలు, కవులు, భాషాభిమానులు పాల్గొనడం సహజం. మండ్యలో విద్యార్థులు, రైతులు, వ్యవసాయ కూలీలు, యువత వంటివారు పెద్దసంఖ్యలో పాల్గొనడం సర్వత్రా ప్రత్యేకత అనిపిస్తోంది.

ప్రముఖులు వీరే...

తొలిరోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ సాన్నిధ్యం వహించారు. సాహితీవేత్తలు డాక్టర్ దొడ్డరంగేగౌడ, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ చంద్రశేఖర కంబార, మంత్రులు మహదేవప్ప, మునియప్ప, శివరాజ్ తంగడిగ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణి, ఎమ్మెల్యేలు నరేంద్రస్వామి, రవికుమార్, రమేశ్ బండిసిద్దేగౌడ, కేఎం ఉదయతోపాటు పలువురు పాల్గొన్నారు.



ప్రత్యేక కలశాలతో మహిళల కోలాటం



చిరుత కళేబరం

గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతి

- విజయనగరం జిల్లా కానహొసళ్ళి సమీపంలో ఘటన

- 8లో..



పొలాల్లో తిరుగుతున్న ఒంటరి ఏనుగు

8

ఒ(తు)ంటరి ఏనుగు..

- పొలాలను పాడు చేస్తోందని రైతుల ఆవేదన

బెంగళూరులో అమెరికా రాయబార కార్యాలయం

- ఎంపీ తేజస్వి సూర్య

బెంగళూరులో అమెరికా రాయబార కార్యాలయం స్థాపించడం చారిత్రాత్మక మైలురాయి అని బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య అభిప్రాయ పడ్డారు. జనవరి రెండోవారంలో రాయబార కార్యాలయం స్థాపిస్తున్నట్లు అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి ప్రకటించడం సంతోషకరమన్నారు.



7

సినిమా హీరోలకు ఉన్న గౌరవం

తల్లిదండ్రులకు లేదు



ఇంకెన్నాళ్లు..?

- సొంత గూటికోసం 9 లక్షలమంది ఎదురుచూపు
- పూర్తికాని లక్ష్యం
- ప్రభుత్వాలు మారినా మారని తలరాతలు... పేద, మధ్యతరగతి వర్గాల్లో ఆవేదన

బెంగళూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయాలనేది మా ప్రభుత్వ లక్ష్యమని దశాబ్దాలకాలంగా పాలకులు చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. సొంతగూటి కోసం రాష్ట్రంలో ఏకంగా 9లక్షలమంది ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం పేదలపట్ల నిర్లక్ష్యం చేసిందని అటువంటి పరిస్థితి తమ పాలనలో రానివ్వమని అధికారం చేపట్టే ఆరంభం... గృహ నిర్మాణశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టేవారు చెబుతున్నారు. వారి వాగ్దానానికి ఏళ్లు గడుస్తున్నాయిగానీ నిరుపేదలకు మాత్రం నీడ సాధ్యం కావడం లేదు.

2013-18 కాంగ్రెస్ పాలనలో 14.54 లక్షల ఇళ్లు నిర్మించామని 2019-23 వరకు అధికారంలో ఉన్న బీజేపీ కేవలం 5.19 లక్షల ఇళ్లను మాత్రమే నిర్మించిందని ఈ ఏడాది ప్రారంభంలో బడ్జెట్ ప్రసంగంలో సీఎం సిద్దరామయ్య తెలిపారు. ప్రస్తుతం 12లక్షల ఇళ్లను నిర్మించాల్సి ఉందన్నారు. 2025 మార్చి ఆఖరుకు 6 లక్షల ఇళ్లు నిర్మించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు పూర్తి చేసింది కేవలం 2.75 లక్షలు మాత్రమే. ఇంకా 3.25 లక్షల ఇళ్లు మరో మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. అంటే 50శాతం ఇళ్ల నిర్మాణం లక్ష్యం కూడా సాధ్యం కాలేదు.

- ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లులేనివారిని గుర్తించేందుకు ఓ సమీక్ష చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లులేనివారిని గుర్తించాలనేది తమ లక్ష్యమని ప్రకటించుకుంది. అయితే ఈ హామీకి నెలలు గడుస్తున్నా అటువంటి సర్వే ఒకటి ప్రభుత్వం ఆలోచనలో ఉందనేది పాలకులే మరిచిపోయినట్లుగా ఉంది. ఆర్థికంగా వెనుకబడినవారు సొంతింటికోసం దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య రోజూ పెరుగుతోంది. దరఖాస్తు చేసుకునేవారికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం సాధ్యం కావడం లేదు.

ఎందుకో..?

రాజీవ్‌గాంధీ హౌసింగ్‌బోర్డు నుంచి ప్రముఖంగా 5 పథకాల ద్వారా నగర, గ్రామీణ ప్రదేశాల్లో డిమాండ్ ఆధారంగా 3లక్షల ఇళ్లను నిర్మించి పంపిణీ చేయాలని ఉద్దేశించారు. బసవ వసతి పథకం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆవాజ్ యోజన, దేవరాజ్ అరసు హౌసింగ్ స్కీమ్‌ల కింద గ్రామీణ ప్రదేశాలలో నిర్మాణాలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద డిమాండ్ భారీగా ఉన్నా నిర్మాణాలు కనీసస్థాయిలో కూడా సాధ్యం కావడం లేదు. నగర ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద 1.61 లక్షల ఇళ్లు నిర్మాణం లక్ష్యం కాగా 61,470 ఇళ్లు మాత్రమే సాధ్యమయ్యాయి. ఇదే పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో 71వేలకుగాను 28,871 మాత్రమే నిర్మించారు. మురికివాడల అభివృద్ధి మండలి ద్వారా 1.80 లక్షల ఇళ్లు, రాజీవ్‌గాంధీ అభివృద్ధి మండలి ద్వారా 50వేల ఇళ్లు రాయితీ దరలతో నిర్మించి పంపిణీ చేయాలని పదేళ్లక్రితమే తీర్మానించినా కార్యరూపం దాల్చలేదు. లబ్ధిదారులు 5 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎక్కువమంది బ్యాంకు నుంచి రుణం సాధ్యం కాక, లక్షలాది రూపాయలు సమకూర్చుకునే పరిస్థితి లేక వెనుకడుగు వేయడంతో పథకం ఎక్కడ వేసిన గొంగళి అనేలా మారింది. ఇటువంటి లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో 1,18,359 ఇళ్లను ప్రధానమంత్రి ఆవాజ్ యోజనకింద నిర్మిస్తామని సీఎం ప్రకటించారు. లబ్ధిదారులు వాస్తవానికి 5 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉండేది. అందులో 4 లక్షల రూపాయలు ప్రభుత్వమే జమ చేయనుంది. లబ్ధిదారులు లక్ష జమ చేస్తే ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.



- రెండేళ్లలో 12 లక్షల లక్ష్యం కాగా సుమారు 9 లక్షలమంది సొంతింటి కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూసే పరిస్థితి ఉంది. బెంగళూరులో 1బీహెచ్‌కే 45,124, 2బీహెచ్‌కే 4,324తోపాటు అపార్ట్‌మెంట్‌లు నిర్మించదలిచారు. అయితే 1బీహెచ్‌కే 4417, 2బీహెచ్‌కే 304 మాత్రమే పూర్తయ్యాయి. ఆన్‌లైన్‌లో ఇంతవరకు 1బీహెచ్‌కే ఇంటికోసం 59,104, 2బీహెచ్‌కే ఇంటికోసం 5191మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 1బీహెచ్‌కే కోసం 13,548మంది, 2బీహెచ్‌కే కోసం 548మంది అడ్వాన్స్ రూపంలో రూ.50వేల నుంచి లక్ష రూపాయల దాకా చెల్లించారు. లబ్ధిదారులకు 6.5లక్షలతో ఇంటిని నిర్మించాల్సి ఉంది. ఇలా లక్షలాదిమంది సొంతింటికోసం ఎదురుచూస్తున్నారు.

2023-24 నుంచి ఇంతవరకు ఇళ్ల నిర్మాణాల వివరాలు

పథకం పేరు	లక్ష్యం	పూర్తయిన ఇళ్లు
బసవ వసతి పథకం	2,39,000	1,13,546
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆవాజ్ యోజనె (గ్రా)	87,000	45,954
దేవరాజ్ అరసు వసతి ఆవాజ్ యోజనె (గ్రా)	17,000	10,233
ప్రధానమంత్రి ఆవాజ్ యోజనె (గ్రా)	71,000	28,871
గ్రామీణ ప్రదేశంలో మొత్తం	4,14,000	1,98,604
అంబేడ్కర్ ఆవాజ్ యోజనె (న)	10,000	4,916
దేవరాజ్ అరసు యోజనె	2,000	291
వాజ్‌పేయ్ నగర వసతి	13,000	10,240
ప్రధానమంత్రి ఆవాజ్ యోజనె	1,61,000	61,470
నగర ప్రదేశాలలో మొత్తం	1,86,000	76,917
మొత్తం	6,00,000	2,75,000

శరణమయ్యప్పా.. స్వామి..



అయ్యప్పస్వామికి చక్రస్నానం చేయిస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారి చక్రస్నానం వైభవంగా జరిగింది. కోఆప్షన్ మెంబర్ గంగన లక్ష్మిరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వందలాదిమంది మాలధారులు హాజరయ్యారు. మొదటిరోడ్డులోని ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తిని హెచ్చెల్సీ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం కెనాల్‌లో ప్రసాద్ నంబూద్రి స్వామి చేతులమీదుగా స్వామివారికి శాస్త్రబద్ధంగా చక్రస్నానం చేయించారు. భక్తులు స్వామివారి ఉత్సవమూర్తిని తలపై ఉంచుకుని నీటిలో మునిగారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి చేర్చారు. మండలపూజల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు ఆలయ ఆవరణలో మహాపడిపూజ నిర్వహించనున్నట్లు లక్ష్మిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటనారాయణ, రామ్‌నారాయణ, చలపతి, ఏఎంసీ శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న మాలధారులు

నేటి నుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా శనివారం నుంచి ఆంధ్రా-మహారాష్ట్ర జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ స్టేడియంలో జరుగుతుంది. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న ఇరు జట్ల క్రీడాకారులు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ చేశారు. ఆంధ్రా హెడ్‌కోచ్ ఏపీ ప్రతాప్, మహారాష్ట్ర హెడ్ కోచ్ అజయ్‌చవాన్‌ల సమక్షంలో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ ఇలా అన్ని విభాగాల్లో సాధన చేశారు. మ్యాచ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. ఆంధ్రా జట్టుకు జిల్లా క్రీడాకారులు వీరారెడ్డి, జయంత్ కృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.



నెట్ ప్రాక్టీస్

తిమ్మమ్మను జాతీయస్మారకంగా గుర్తించాలి

అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్

అనంతపురం కల్చరల్/నంబులపూలకుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించిన శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట మండలంలోని తిమ్మమ్మ మర్రిమానును జాతీయ స్మారకంగా గుర్తించాలని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్‌సింగ్ రావత్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన తిమ్మమ్మ మర్రిమాను చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. తిమ్మమ్మ మర్రిమానుకు పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉన్నప్పటికీ అక్కడ కనీస సౌకర్యాలు లేక పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ ప్రాంతాన్ని జాతీయస్మారకంగా గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ స్పందిస్తూ తిమ్మమ్మ మర్రిమాను అంశాన్ని కేంద్ర అటవీ పర్యావరణ శాఖకు రెకమెండ్ చేస్తామని హామీ ఇచ్చారు.



కేంద్ర పురావస్తుశాఖ డీజీ యదుబీర్‌సింగ్ రావత్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జాస్తి వీరాంజనేయులు

ప్చ్.. వేస్ట్..

నిరుపయోగంగా మార్కెట్‌యార్డు

- యార్డులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు
- రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్న రైతులు



నిరుపయోగంగా మారిన మార్కెట్ యార్డు గోడౌన్



పిచ్చి మొక్కల మధ్య మరుగుదొడ్లు

44వ జాతీయ రహదారిపై ఆరబోసిన వరిధాన్యం

రోడ్డుపైకి రావాల్సిందే



పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ధాన్యం ఆరబోయాలంటే జాతీయ రహదారులపైకి రావాల్సిందే. ఉన్న మార్కెట్‌యార్డును ఎవరు పట్టించుకోకపోవడంతో అందులో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిగా మారింది. అధికారులు, నాయకులు స్పందించి మార్కెట్ యార్డును శుభ్రం చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– నరసింహులు, రైతు, ఇల్లూరు

గార్లదిన్నె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారింది. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించిన ధాన్యం అరబోసుకునేందుకు, నిల్వ ఉంచుకునేందుకు కొన్నేళ్ల కిందట కల్లూరు గ్రామం 44వ జాతీయ రహదారి పక్కన మార్కెట్ యార్డు, గోడౌన్‌లు, ప్లాట్ ఫాంలు నిర్మించారు. మండల రైతులతో గతంలో మార్కెట్ యార్డు నిత్యం కళకళలాడేది. మార్కెట్ యార్డులో ఎంతోమంది కూలీలకు ఉపాధి కూడా లభించేది. అయితే రానురాను మార్కెట్ యార్డుపై అధికారులు, పాలకులు శీతకన్ను వేయడంతో అది పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో పండించిన ధాన్యాన్ని రైతులు జాతీయ రహదారిపై ఆరబోసుకుంటున్నారు. ఈక్రమంలోనే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి అధికారులు ప్రయాణిస్తారే తప్ప రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. మార్కెట్ యార్డులోని గోడౌన్లను కూడా వ్యవసాయేతర పనులకు అద్దెకు ఇచ్చేశారు. కల్లూరులో మార్కెట్ యార్డు ఉందని పాలకులు, అధికారులకు తెలిసినా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. యార్డును బాగుచేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిని కోరినట్లు వారు పేర్కొన్నారు.

రైతులకు అనుకూలంగా మార్చాలి

కల్లూరులోని మార్కెట్‌యార్డును కోట్లాది రూపాయలతో రైతుల కోసం నిర్మించారు. కల్లూరు, ఇల్లూరు, కేశవాపురం, కొప్పలకొండ, కమలాపురం సిరివరం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేశారు. అయితే పండించిన పంటను అమ్ముకోవాలంటే ధాన్యం ఆరబోసుకోవాలి. ధాన్యం తడిగా ఉంటే తక్కువరేటుకు కొంటారు. ధాన్యం అరబోసుకోవాలంటే స్థలం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డును రైతులకు అనుగుణంగా మార్చాలి.

– చెన్నారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి



వినియోగంలోనే ఉంది

కల్లూరు మార్కెట్‌యార్డు వినియోగంలోనే ఉంది. రైతులు కూడా వరి ధాన్యంను ఆరబోసుకుంటున్నారు. గోడౌన్లను ఎవరు వినియోగించుకోకపోవడంతో ఎలక్ట్రికల్ వారికి అద్దెకు ఇచ్చాం. నెలకు రూ.1.32 లక్షల అద్దె వస్తోంది.

– కేధార్‌నాథ్, నియోజకర్గం మార్కెట్ యార్డు కార్యదర్శి

మార్కెట్‌యార్డును వినియోగంలోకి తేవాలి



రైతులకు ప్రయోజనం చేసేందుకు గత ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మార్కెట్‌యార్డును నిర్మిస్తే కొందరు అధికారులు వాటిని రైతులకు కాకుండా వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం ఏంటి. మార్కెట్‌యార్డును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనాథ్‌చౌదరి, ఏఐవైఎఫ్

అభివృద్ధి పనులు వేగంగా చేయండి

సీఎఫ్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) అనంతపురం సర్కిల్ పరిధిలోని అటవీశాఖలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సీఎఫ్ (కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) యశోదాబాయి ఆదేశించారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని డీఎఫ్ఓ చాంబర్‌లో శుక్రవారం ఆమె సర్కిల్ పరిధిలోని డీఎఫ్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే అనుమతులు పొంది ప్రారంభించిన అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లాల వారిగా ఆరా తీశారు. చేస్తున్న పనుల్లో లోపాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద అనుమతులు పొంది ప్రారంభించిన పనుల్లో పురోగతి ఉండేలాలా చూసుకోవాలి ఆదేశించారు. ఎదురయ్యే సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారమార్గాలు చూపాలన్నారు. సమావేశంలో అనంతపురం డీఎఫ్ఓ విఘ్నేష్, శ్రీ సత్యసాయి జిల్లా డీఎఫ్ఓ చక్రపాణి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్, చిత్తూరు డీఎఫ్ఓ భరణి, పెనుకొండ సబ్‌డీఎఫ్ఓ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న సీఎఫ్ యశోదాబాయ్

మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

- డీఈఓకు ఎస్టీయూ నేతల వినతి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తప్పులు సవరించి ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న మున్సిపల్ టీచర్లకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు డీఈఓను కోరారు. ఆ సంఘం నాయకులు డీఈఓ ప్రసాద్‌బాబును శుక్రవారం ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఖాళీలను ప్రమోషన్లతో భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక కారణాలతో ప్రమోషన్లు జరగలేదన్నారు. తాజాగా ఇస్తున్న ప్రమోషన్లలో 70:30 నిష్పత్తిలో రోస్టర్ పాయింట్లు లెక్కించి, ఖాళీలు భర్తీ చేయాలన్నారు. తెలుగు,హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ సబ్జెక్టుల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలన్నారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాల్లోని తప్పులను సవరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సూర్యుడు, ఫణిభూషణ్, అజయ్‌కుమాంర్, మల్లికార్జున, గంగాధర్,శ్రీనివాసరెడ్డి, కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు.. అధికారుల బేజారు..!

వైసీపీ హయాంలో భారీ అక్రమాలు

- రూర్బన్‌లో అవినీతిపై లోకాయుక్తకు ఫిర్యాదు
- నిత్యం తనిఖీలతో బెంబేలు
- 12 పంచాయతీలకు ఇద్దరే కార్యదర్శులు
- ఖాళీ కాబోతున్న ఎంపీడీఓ కార్యాలయం



ఖాళీగా కనిపిస్తున్న ఎంపీడీఓ సీటు

కళ్యాణదుర్గం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జరిగిన అక్రమాలతో ప్రస్తుతం అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఎవరు తనిఖీలకు వస్తారో.. ఏ రికార్డులు అడుగుతారోనని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సతమతమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ తరహా మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2016లో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని కంబదూరు మండలాన్ని ఎంపిక చేశారు. కేంద్రం 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 70 శాతం నిధులు కేటాయించేలా మార్గదర్శకాలు రూపొందించారు. మండలంలోని 12 పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ. 127 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దాదాపు రూ. 100 కోట్ల వరకు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడ్డారు. రూ.కోట్లల్లో అవినీతి జరిగిందని 2020లో లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. ఆ మేరకు విచారణ అధికారిగా డీఎస్పీ కోలార్‌క్రిష్ణ వచ్చి 12 పంచాయతీల్లో జరిగిన పనులపై తనిఖీలు చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్, జిల్లా అధికారులు...ఇలా పలు విభాగాల అధికారులు వచ్చి తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారుల అవినీతి పాపానికి మా కేంటి ఈ ఖర్మ అంటూ ఈ కార్యాలయంలో పనిచేయడానికి భయపడుతున్నారు. పరిస్థితి చూస్తుంటే కంబదూరు మండల పరిషత్ కార్యాలయం అంతా ఖాళీ అవుతున్నట్లు తెలుస్తోంది. మండల అభివృద్ధికి కీలకమైన మండల పరిషత్తు కార్యాలయంలోనే సిబ్బంది కొరత వెంటాడుతోంది.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోనే దిక్కు

కంబదూరు మండల పరిషత్ కార్యాలయానికి ఇన్‌చార్జ్ ఎంపీడీవోనే దిక్కుగా మారారు. కళ్యాణదుర్గం ఎంపీడీవో రామచంద్రను కంబదూరుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. రెండు మండలాల్లో పనిచేయాలంటే ఆయనకు తలనొప్పిగా మారింది. కళ్యాణదుర్గం ఎంపీడీవోగానే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని, కంబదూరు ఇన్‌చార్జ్ వద్దు అంటూ ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిసింది. కార్యాలయ ఏవో కూడా అనారోగ్యంతో సెలవులో వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈవోఆర్డీగా గూడెన్న రెండు నెలల క్రితమే మండలానికి వచ్చారు. ఇక్కడ జరిగిన పనులపై సమగ్రంగా నివేదికలు చూపించలేక సతమతమవుతున్నట్లు తెలిసింది. ఈయన కూడా త్వరలోనే పదవీ విరమణ చేయనున్నారు.



కంబదూరు మండల పరిషత్ కార్యాలయం

అన్నింటిలోనూ అక్రమాలే....

కంబదూరు మండలంలోని 42 గ్రామాల్లో అండర్ గౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి పైపులైన్లు, ఘన వ్యర్థాల నిర్వహణ, స్థానిక నిరుద్యోగులు, మహిళలకు ఉపాధి శిక్షణ, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల నిర్మాణం వంటి పనులు చేపట్టారు. ప్రతి పనిలోనూ అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ అధికారులు గుర్తించారు. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు కుమ్మక్కై సుమారు రూ. 25 కోట్ల వరకు అవినీతి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

12 పంచాయతీలకు ఇద్దరే కార్యదర్శులు

కంబదూరు మండలంలో 12 పంచాయతీలు ఉన్నాయి. ఇద్దరు కార్యదర్శులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అపార్ కష్టాలతో సతమతమవుతున్న విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శుల కొరతతో అస్తవ్యస్తంగా మారిపోయింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు గ్రామీణులు సతమతమవుతున్నారు. మండల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీ కార్యదర్శుల కొరతతో పాలన అస్తవ్యస్తంగా మారింది.

సంపద సృష్టి జరిగేనా..?

చెత్తతో సంపద తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం

- లక్షలు ఖర్చు చేసినా.. నిష్ప్రయోజనం
- కూటమి ప్రభుత్వంపై గ్రామీణుల ఆశలు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 20: అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో సంపద సృష్టి ఏమో గాని, ప్రజా ధనం చెత్తలో కలిసిపోతోంది. గత టీడీపీ పాలన(2014-19)లో లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్తతో సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. చెత్త సేకరణకు ప్రతి కేంద్రానికి ఇద్దరి నుంచి ఐదుగురు కార్మికుల(క్లాప్‌మిత్ర)ను నియమించారు. వీరు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, దాన్ని రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చి తక్కువ ధరకు రైతులకు అందించాలి. ఇందుకు ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ. ఆరు వేలు జీతం ఇచ్చేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా గాలికి వదిలేయడంతో కొన్ని చోట్ల సంపద తయారీ కేంద్రాలు దిష్టిబొమ్మలుగా మారాయి. ఇంటింటి నుంచి చెత్త సేకరించడానికి ప్రభుత్వం అందించిన సైకిళ్లు తుప్పుపట్టిపోయాయి.



తుప్పు పట్టిన మూడు చక్రాల వాహనం

జీతాలు సక్రమంగా రాకపోవడంతో క్లాప్ మిత్రులు చెత్త సేకరణకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందుకు గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తుప్పు పట్టిన వాహనాలు

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి మండలంలోని ఆవులదట్ల, కొంతానపల్లి, 74 ఉడేగోళం, చదం, ఆర్‌బీవంక గ్రామాలను గత టీడీపీ ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ క్రమంలోనే మండలంలోని 19 పంచాయతీల్లో 19 చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పని చేసేందుకు 69 మంది క్లాప్‌మిత్రులు, 19 మంది షెడ్ మిత్రులను మొత్తం 88 కార్మికులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి నిత్యం క్లాప్ మిత్రులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి ఆ చెత్తను సంపద కేంద్రానికి తరలించి, రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చాలి. ఆ ఎరువును రైతులకు అమ్మి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వాడటం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. అయితే గత ఐదేళ్లతో వైసీపీ ప్రభుత్వం ఈ సంపద నిర్మితి కేంద్రాలను గాలికొదిలేసింది. దీంతో చాలా కేంద్రాల వద్ద చెట్లు పెరిగాయి. వాహనాలు నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి వాహనాలు వాడకపోవడంతో తుప్పు పట్టిపోయాయి. ప్రస్తుతం వాటిని వాడుకోవాలన్నా ఉపయోగపడే పరిస్థితులు లేవు.



నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

ఐదేళ్లుగా గాలికి వదిలేశారు



గత వైసీపీ ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం అందులో పని చేసే వారికి కూడా సక్రమంగా జీతాలు ఇవ్వలేదు. దీంతో కొంతమంది పారిశుధ్య కార్మికులు చెత్తసేకరణకు రావడం మానేశారు. ఈ సమస్యపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టి చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలి.

– రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్, గ్రామదట్ల

ప్రత్యేక దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నిరుపయోగంగా ఉన్న ఈ కేంద్రాలను త్వరలో వాడుకలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. వాహనాలకు మరమ్మతులు చేపట్టి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసేలా చూస్తాం.

– కొండన్న, ఎంపీడీఓ

జిల్లా జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ శుక్రవారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడారు. ఆహారం, నివాసం, ఆరోగ్య స్థితిగతులు, జైలు అధికారుల ద్వారా అందజేస్తున్న సౌకర్యాల గురించి ఖైదీలతో విచారించారు. న్యాయ సేవల లభ్యత, అప్పీల్ హక్కు, ప్లీ బేరసారాలు, న్యాయ సహాయం గురించి ఖైదీలకు తెలియజేశారు. అనంతరం ఓపెన్ ఎయిర్ జైలు, ప్రభుత్వ బాలుర అబ్జర్వేషన్ హోమ్‌ను సందర్శించారు.

అదృశ్యమైన వారి గుర్తింపులో నిర్లక్ష్యం తగదు

గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో మిస్సింగ్ సిటిజన్స్ గుర్తింపులో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తప్పవని గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ జిల్లా అధికారులను హెచ్చరించారు. కమిషనరేట్ నుంచి శుక్రవారం జిల్లా అధికారులతో ఆయన జూమ్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డీపీఓ నాగరాజనాయుడు సంబంధిత సిబ్బందితో కలిసి తన చాంబర్‌లో జూమ్‌మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డుల్లో మిస్సింగ్ సిటిజన్స్ గుర్తింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కమిషనర్ ఆదేశించినట్లు తెలిపారు. ఆధార్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కూడా సూచించినట్లు పేర్కొన్నారు. ఈక్రమంలోనే జిల్లాలో చాలా వరకు అన్ని పనులు పూర్తి చేశామని, పెండింగ్ ఉన్నవాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పినట్లు డీపీఓ వెల్లడించారు.

పదో తరగతి దాకా కన్నడలోనే చదవాలి

» అక్షరజాతరలో సమ్మేళనాధ్యక్షుడు గొ.రు.చన్నబసప్ప పిలుపు



బెంగళూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి దాకా కన్నడ మీడియం తప్పనిసరి కావాలని అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడు గొ.రు.చన్నబసప్ప అభిప్రాయపడ్డారు. మండ్యలో శుక్రవారం 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం అంగరంగ వైభవంగా ఆరంభమైంది. సమ్మేళనంలో గొ.రు.చన్న బసప్ప అధ్యక్షుడి హోదాలో కీలకమైన ప్రసంగం చేశారు. ఇంగ్లిష మీడియం స్కూళ్లను తెరవడం లేదా ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం వంటివి వెంటనే నియంత్రించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కన్నడ భాషను నేటితరం విద్యార్థుల ఎదుగుదలకు అక్షరంగా ఉండాలన్నారు. 48 పేజీల సుదీర్ఘ ప్రసంగంలో భాష, సంస్కృతి కోసం పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. భాషాపరంగా సమస్యలు, అంతర్రాష్ట్ర భాషా స ద్వినియోగం, హిందీకి ప్రాధాన్యత, సాంకేతిక సద్విని యోగం, సరిహద్దు కన్నడిగుల సంస్కృతి, పుస్తక సంస్కృతి తోపాటు మహిళలకు లభించాల్సిన ప్రాధాన్యత అనే 21 అంశాలపై గొ.రు.చ ప్రస్తావించారు. వాటి వివరాలిలా.

15శాతం విద్యకు రిజర్వు చేయాలి

అవసరమనిపిస్తే ఇంగ్లిష నేర్పేందుకు ప్రత్యేక వ్యవస్థ కల్పించాలని, బోధనలకు నైపుణ్యత కల్గిన ఉపా ధ్యాయులను నియమించాలని, గ్రామీణ ప్రాంతా లలోని కన్నడ పాఠశాలల్లో అన్ని సౌలభ్యాలు సంపూర్ణంగా సిద్ధం చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 15శాతం విద్యకు రిజర్వు చేయాలని డిమాండ్ చేశారు.

సరోజిని నివేదిక అమలు చేయాలి

దశాబ్దాలకాలంగా అమలుకు నోచుకోని సరో జిని మహిషి నివేదికను చట్టబద్ధంగా అమలు చేయాలని వాటి పర్యవేక్షణను కన్నడ అభివృద్ధి ప్రాధికారకు అప్పగించాలని సూచించారు. ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఏదైనా ఉద్యోగా అవకాశాలలో ఉన్నత హోదాలను విడిచి సి, డి గ్రూప్ పోస్టులు పూర్తిగా కన్నడిగులకే కేటాయించాలని సూచిం చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ సమా చారం లభించాలన్నారు. కన్నడ విశ్వవిద్యాలయం, జాన పద విశ్వవిద్యాలయాలకు గ్రాంట్ల కొరత తీవ్రంగా ఉందని వాటికి నిధులు పెంచడంతోపాటు బోధనా సిబ్బందిని నియమించాలని సూచించారు. కన్నడకు శాస్త్రీయభాషా కేంద్రాన్ని స్వతంత్రంగా నిర్వహించేందుకు కేంద్రప్రభుత్వం నుంచి అవసరమైన సౌలభ్యాలు సాధించాలన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు కావాలి

రాష్ట్రంలో పర్యాటక, సాంస్కృతిక, విద్య రంగాలలో ఆదా యం, ఉద్యోగావకాశాలు విస్తరింపచేసేలా అభివృద్ధి చేయా లన్నారు. పరిశ్రమల స్థాపన అన్ని జిల్లాల్లోనూ ఆరంభిం చాలని, ఏ పరిశ్రమ అయినా కన్నడిగులకు ఉద్యోగ అవ కాశాలు కల్పించాలనే నిబంధన కొనసాగించాలన్నారు. అమలు చేయనివారిపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలన్నారు. ప్రభుత్వ కార్యాల యాలు మినహాయించి మిగిలిన ఆఫీసు లను వివిధ జిల్లా కేంద్రాలకు బదిలీ చేసి బెంగళూరుపై ఒత్తిడిని తప్పించాలని సూచించారు. విద్య, అంతర్రాష్ట్ర సరి హద్దు, నీరు, వలస సమ స్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో ఒక పాలసీ ని రూపొందిం చాలని కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. ప్రాంతీయ అసమానతలను సరిచేసేలా కిత్తూరు కర్ణాటక, కల్యాణ కర్ణాటక ప్రాంతాలలో వెనుక బడిన ప్రదేశాల అభివృద్ధికి కాలానికి అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. బసవణ్ణను సాంస్కృతిక నాయ కుడిగా ప్రకటించారని బసవకల్యాణలో నూతన అనుభవ మంటపం నిర్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 12వ శతాబ్దంలోని బసవణ్ణ క్షేత్రాల సంరక్షణ అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ప్రకటించినట్టుగా వచన విశ్వవిదాలయాన్ని వచ్చే అకడమిక్ నుంచి ఆరంభించాలి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమలు, దుకాణాలకు కన్నడ బోర్డులు తప్పనిసరి చేయాలన్నారు. అమలు చేయకుంటే చర్యలు తీసుకో వాలన్నారు. పర్యావరణంపై ప్రత్యేకంగా పశ్చిమ కనుమల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి, అక్కడ గనుల తవ్వకాలకు అవకాశం ఇవ్వరాదు. జ్ఞానాన్ని ప్రసాదించే కేంద్రాలైన గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రంథాలను ఏటా తప్పనిసరిగా కొనుగోలు చేయాలి. లైబ్రరీట్యాక్స్‌ను వాటి అభివృద్ధికే ఉపయోగించాలి. సీనియర్ సాహితీవేత్తల రచనలను ప్రచురించే విధానం కొనసాగించాలి.

పాలనలో కన్నడ వాడకం కొనసాగించాలి

పాలనలో కన్నడ వాడకం తప్పనిసరిగా కొనసాగించాలి. కన్నడ లిపిను ఆధునిక సాంకేతిక విధానాలకు సద్వినియోగం చేసేలా చర్యలు చేపట్టాలి. ఏఐ టెక్నాలజీని ఉపయోగించాలి. సాహిత్య సంస్కృతి కల్గిన సంఘ సంస్థలకు ఆర్థికసాయం చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాంతీయభాషలపై హిందీ ప్రభావానికి అవకాశం ఇవ్వరాదు. కన్నడ రచనలు ఇతర భాషలలోకి అనువదించి ప్రచురించేందుకు ప్రోత్సహించాలి. ఇందుకోసం భాషా ప్రాధికార అవసరమైన ఆర్థికసాయం చేయాలి. కన్నడ సాహిత్య పరిషత్ ఒక ప్రాతినిధ్య సంస్థ. అది జరిపే సమ్మేళనంలో తీసుకునే నిర్ణయాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలి. జాప్యం లేకుండా అమలు చేయాలి. కన్నడ సాహిత్య పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులకు సాహిత్యం, సంస్కృతిపై శిబిరాలను ఏర్పాటు చేయాలి.


జ్ఞాపికలతో మహిళల ర్యాలీ


ప్రత్యేక పుస్తకావిష్కరణలో సీఎం తదితరులు



కావేరి పోరాటంపై ఓ అభిమాని..

సినిమా హీరోలకు ఉన్న గౌరవం తల్లిదండ్రులకు లేదు

» ఎమ్మెల్యే సుబ్బారెడ్డి విచారం

బాగేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటి యువత అధికశాతం మంది కన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారని వారి బాగోగులు పట్టించుకోవడం లేదని అయితే సినిమా హీరోల బ్యానర్లు, కటౌట్‌లకు క్షీరాభిషేకం చేస్తున్నారని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి విచారం వ్యక్తం చేశారు. తాలూకాలోని పూలవారిపల్లి గ్రామ శివారులోని మొరార్జీదేశాయ్ వసతి పీయూ కళాశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ హీరోలకు ఇస్తున్న విలువ తల్లిదండ్రులకు లేకుంటే ఎలాగని ఈధోరణి మారాలన్నారు. హీరోపై అభిమానం తప్పుకాదని అయితే కన్నవారిని గౌరవించకపోవడం, నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. పిల్లల ఉజ్వలభవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో శ్రమిస్తారని వారి కష్టాన్ని అర్థం చేసుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలతో మంచి హోదాలలోకి రావాలని అభిలషించారు. గుణాత్మక విద్యకోసం వసతి పాఠశాలలకు రూ.200కోట్లు గ్రాంటు తెచ్చి అభివృద్ధి చేస్తున్నానని, ప్రస్తుతం 146మందికి ట్యాబ్‌లు, నీట్, జేఈఈ, సీఈటీ పుస్తకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి తేజానందరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 24 వసతి పాఠశాలల్లో ఉన్నా బాగేపల్లి నియోజకవర్గంలో వందశాతం వసతి పాఠశాలలకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. విద్యాప్రగతి కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అందుకు ప్రతిగా పిల్లలు బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ శేషాద్రి, గుడిబండ లక్ష్మీపతిరెడ్డి, పురసభ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గడ్డం రమేశ్, జిల్లా పంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పూజప్ప, మాజీ సభ్యుడు నరసింహప్ప, కేడీపీ సభ్యుడు మంజునాథరెడ్డి, మొరార్జీదేశాయ్ వసతి పీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

బెంగళూరులో అమెరికా రాయబార కార్యాలయం

బెంగళూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో అమెరికా రాయబార కార్యాలయం స్థాపించడం చారిత్రాత్మక మైలురాయి అని బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్య అభిప్రాయపడ్డారు. జనవరి రెండోవారంలో రాయబార కార్యాలయం స్థాపిస్తున్నట్టు అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈమేరకు తేజస్విసూర్య కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బెంగళూరు ప్రజల సుదీర్ఘకాల డిమాండ్‌కు అంతిమరూపం లభించిందన్నారు. 2019లోనే బెంగళూరులో రాయబార కార్యాలయం ఏర్పాటుకు డిమాండ్ చేశామన్నారు. దేశంలోనే ఐటీ ఆదాయంలో 40శాతం కర్ణాటక నుంచే సాధ్యమని, ఇక్కడ ఐటీ నిపుణులు లక్షలమంది ఉన్నారన్నారు. అమెరికా కాన్సులేట్ ఏర్పాటు కావడం ద్వారా యూఎస్ వీసా పనులకు చెన్నై లేదా హైదరాబాద్ వెళ్లే పరిస్థితి తప్పినట్టు అవుతుందన్నారు. అమెరికాకు చెందిన 370 కంపెనీ లతోపాటు 750 ఎంఎన్‌సీలు బెంగళూరులో ఉన్నాయని వారందరికీ అనుకూలం కానుందన్నారు. యూఎస్ రాయబారులు కెన్నత్ జెస్ట న్, ఎరిక్ గార్సెట్టిలకు ధన్యవాదాలు తెలిపారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ఐటీ బీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే 'ఎక్స్' ద్వారా ప్రకటించారు.

పర్యావరణ స్నేహిగా గ్రీన్ ఫైనాన్స్

బెంగళూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ రంగంలో సుదీర్ఘకాల అనుభవం కల్గిన శ్రీరామ్ సంస్థ భావితరాలకు పర్యావరణ మేలు చేకూర్చేలా గ్రీన్ ఫైనాన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వదలిచినట్టు ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్ ఉమేశ్ రేవంకర్, ఎండీ సీఈఓ వైఎస్ చక్రవర్తిలు ప్రకటించారు. శుక్రవారం బెంగళూరులో గ్రీన్ ఫైనాన్స్ బిజినెస్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. ఎలక్ట్రికల్ వాహనాలు, బ్యాటరీ చార్జింగ్ స్టేషన్‌లు, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల్లో భాగంగా సోలార్ వాడకం, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు ఫైనాన్స్ చేయదలిచినట్టు ప్రకటించారు. రానున్న మూడు నాలుగు సంవత్సరాలలో 5వేల కోట్ల రూపాయలు రుణాలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలకు ఇటీవల ఆదరణ పెరుగుతోందన్నారు. అందుకు అనుగుణంగా ఎలక్ట్రికల్ వాహనాలు కొనుగోలు చేసేవారికి గ్రీన్ ఫైనాన్స్ రూపంలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. బ్యాటరీ చార్జింగ్ స్టేషన్‌ల ప్రాధాన్యత పెరుగుతోందని, వాటిని ఏర్పాటు చేసుకునేవారికి సహకరిస్తామన్నారు. గ్రీన్‌ఫైనాన్స్ పర్యావరణ నిర్వహణ, సుస్థిర ఆర్థిక పరిష్కారాలకు వేదిక కానుందన్నారు.

సీఏ విద్యార్థులు అంకితభావంతో పనిచేయాలి

బెంగళూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఏ విద్యార్థులు అంకితభావంతో పనిచేయాలని ఆర్థికపరమైన సందేహాలను నివృత్తి చేయడంతోపాటు దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని మీనాక్షిసుందరం అభిప్రాయపడ్డారు. భారతీయ చార్టెర్డ్ అకౌంటెంట్స్ బెంగళూరుశాఖ ఆధ్వర్యంలో సీఏ విద్యార్థులకు నవయుగ శీర్షికతో చార్టెర్డ్ అకౌంటెంట్స్‌కు రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చిరత వెంచర్స్ వ్యవస్థాపకులు మీనాక్షి సుందరం, పాకశాల సంస్థాపకుడు కేఎస్ వాసుదేవ అడిగ, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వీవీ ఆరతి, ఎస్ఐసీఏఎస్ఐ అధ్యక్షుడు శ్రీపాద్ హాళగోళ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు. రెండురోజుల శిక్షణలో యువ చార్టెర్డ్ అకౌంటెంట్‌లకు ప్రత్యేకమైన నైపుణ్యత కల్పించారు.

ఆరోగ్యకర సమాజంపై అవగాహన

చింతామణి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ, బీసీ ట్రస్టు, చింతామణి రూరల్ పోలీసులు సంయుక్తంగా 'స్వాస్థ సంకల్ప' పేరిట ఆరోగ్యకర సమాజంపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని తాలూకాలోని నాయనహళ్ళిలోని మొరార్జీదేశాయ్ వసతి పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ధర్మస్థళ సంస్థ తాలూకా యోజనాధికారి వినోద్ మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఒకవేళ అలవాటు ఉంటే మానుకోవాలని హితవు పలికారు. గురువులు, పెద్దలను గౌరవించాలన్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ శివరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలను చేరాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని హెచ్చరిస్తూనే ప్రోత్సహించినవారికి కూడా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఇటీవలికాలంలో సైబర్ నేరాలు పెరిగాయన్నారు. అటువంటి సమస్యలపై అవగాహన పెంచుకుని లోనుకాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం యువత నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ అధికారిని సౌమ్య, ఎస్సై పద్మ, సేవా ప్రతినిధి కలావతి, ఉపాధ్యాయులు వెంకటేశ్, శ్రీకళ, అనితా, శ్వేతా, వరలక్ష్మి, అశోక్‌చ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో సీఐ శివరాజ్ తదితరులు

కోనఘట్ట గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా జ్యోతి రమేశ్


నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో సభ్యులు

దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర తాలూకాలోని కోనఘట్ట గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా జ్యోతి రమేశ్, ఉపాధ్యక్షురాలిగా సుమంగళ వెంకటేశ్ ఎన్నికయ్యారు. శుక్రవారం గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు ఎన్నికలు జరిగాయి. అధ్యక్షురాలిగా కాంగ్రెస్ మద్దతురాలు కోనఘట్ట జ్యోతి రమేశ్, ఉపాధ్యక్షురాలిగా హమామ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మద్దతురాలు సుమంగళ వెంకటేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోనఘట్ట గ్రామ సభ్యురాలికి 25ఏళ్ల తర్వాత గ్రామపంచాయతీ అధ్యక్షస్థానం లభించడం గ్రామస్తులలో హర్షం వ్యక్తం అవుతోంది. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. అధ్యక్షులు మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సభ్యులు మంజునాథ్, బాలరాజ్, ఆరాధ్య, నాగేశ్ టి రామాంజినప్ప, గోవిందస్వామి, నంజ మరియప్ప, లింగనహళ్ళి ఎంపీసీఎస్ అధ్యక్షుడు కేఎం మంజునాథ్, రాష్ట్ర వహ్నికుల క్షత్రియసంఘం డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సావధానంగా ఆలకించండి

బాగేపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వస్తే నిర్లక్ష్యం చేయవద్దని, సావధానంగా ఆలకించి, పరిష్కరించేందుకు ప్రామాణికంగా వ్యవహరించాలని లోకాయుక్త జిల్లా ఎస్పీ జికె ఆంటోనిజాన్ అధికారులను హెచ్చరించారు. పట్టణంలోని తాలూకా కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటైన సభలో ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సభలో 20 అర్జీలు వచ్చాయని వచ్చే 15రోజుల్లోగా వాటి స్థితిగతులపై అర్జీదారుడికి ఆయా శాఖల అధికారులు వివరించాల్సి ఉంటుందన్నారు. ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం తగదన్నారు. శాఖ ఏదైనా ప్రమాణికంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు మనిషా మహేశ్‌పత్రి, తాలూకా పంచాయతీ ఈఓ రమేశ్, పురసభ ముఖ్య అధికారి శ్రీనివాస్, లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ మోహన్, శివప్రసాద్, గురు, చౌడరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో లోకాయుక్త జిల్లా ఎస్పీ జీకే ఆంటోనిజాన్

పరుషలో బహుమతుల ప్రదానం


శిడ్లఘట్ట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామంలో పశువుల పరుషలో పాల్గొన్న ఉత్తమ ఆవులకు బహుమతులను ప్రదానం చేశారు. జిల్లా సహకారపాల సమాఖ్య, వైద్య శాఖ, దేవరమళ్ళూరు పాల ఉత్పత్తదారుల సహకారసంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేఎంఎఫ్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ కోలారు జిల్లాతో పోలిస్తే చిక్కబళ్ళాపుర జిల్లాలో పాల ఉత్పత్తి తక్కువగా ఉందన్నారు. పాడి రైతులను ప్రోత్సహించేలా పాల ప్రోత్సాహకం పెంచాలన్నారు. పరుషలో పాల్గొన్న అన్ని ఆవులు, ఎద్దులకు కన్సొలేషన్ ప్రైజ్‌లు అందచేశారు. చిక్కబల్లాపుర జిల్లా పాల సమాఖ్య ఎండీ శ్రీనివాసగౌడ, పీఎల్‌డి బ్యాంకు అధ్యక్షుడు రామచంద్ర, బంకు మునియప్ప, డాక్టర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందచేస్తున్న శ్రీనివాస్ తదితరులు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

వేదము వేంకటరాయశాస్త్రి (జయంతి)



సుప్రసిద్ధ పండితుడిగా పేరొందిన వేదము వేంకటరాయశాస్త్రి 1853 డిసెంబరు 21న చెన్నైలో జన్మించారు. కవి, విమర్శకుడు, నాటక కర్తగా రాణించారు. మద్రాస్ క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండిత పదవిని 25ఏళ్లపాటు సమర్థవంతంగా నిర్వహించారు. గ్రాంథిక భాషావాది. సాహిత్య ప్రక్రియల్లో వ్యవహారిక భాషా ప్రయోగాన్ని విమర్శించారు. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. మహోపాధ్యాయ, కళాప్రపూర్ణ తదితర గౌరవాలు అందుకున్నారు. 1929 జూన్ 18న కన్నుమూశారు.

'అర్జున' పిచ్చయ్య (జయంతి)



తొలితరం బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు జమ్మలమడుగు పిచ్చయ్య 1918 డిసెంబరు 21న కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో జన్మించారు. 'అర్జున' పిచ్చయ్యగా పేరొందారు. 1955-70ల మధ్య 15 బాల్ బ్యాడ్మింటన్‌లో జాతీయపోటీలలో పాల్గొన్నారు. రెండు దశాబ్దాలలో 9కుపైగా టైటిల్స్ గెలుపొంది ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. 1970లో 'అర్జున' పురస్కారం పొందారు. తుదిశ్వాస వరకు క్రీడావైభవానికి ఎంతో కృషి చేశారు. 104 యేట 2021 డిసెంబరు 26న కన్నుమూశారు.

స్వామి శివానందమూర్తి (జయంతి)



మానవతావాది, ఆధ్యాత్మిక వేత్త, తత్వవేత్తగా పేరొందిన కందుకూరి శివానందమూర్తి 1928 డిసెంబరు 21న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గొప్ప శివభక్తులు, సుమారు 200 శివాలయాలను నిర్మించారు. సనాతన చారిటబుల్ ట్రస్టుకు ప్రధాన ధర్మకర్త. లలితకళలు, సాంకేతికం, విజ్ఞానం, వైద్యం, జర్నలిజం తదితర రంగాల ప్రముఖులను ట్రస్టు ద్వారా సత్కరించేవారు. సంప్రదాయం, సంస్కృతి అంశాలపై పలు రచనలు చేశారు. 2015 జూన్ 10న తుదిశ్వాస వీడారు.

డాక్టర్ యూఆర్ అనంతమూర్తి (జయంతి)




'పద్మభూషణ్' గ్రహీత ఉడుపి రాజగోపాలాచార్య (యూఆర్) అనంత మూర్తి 1932 డిసెంబరు 21న శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళి తాలూకా మేళిగెహళ్ళిలో జన్మించారు. ఆయన రచనలు పలు భాషలలోకి అనువాదం అయ్యాయి. కన్నడ సాహిత్యంలో 'జ్ఞానపీఠ' పురస్కారం అందుకున్నారు. ముక్కుసూటిగా భావాలు వ్యక్తం చేసేవారు. ఆయన రచించిన నవలలు, కథలు సినిమాలుగా రూపు దిద్దుకున్నాయి. ఉత్తమ కథా రచయిత, రాష్ట్ర సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ, రాజ్యోత్సవ పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2014 ఆగస్టు 22న కన్నుమూశారు.

అవసరాల రామకృష్ణారావు (జయంతి)



ప్రముఖ నవలా రచయిత అవసరాల రామకృష్ణారావు 1931 డిసెంబరు 21న చెన్నైలో జన్మించారు. కథలు, రచనల ద్వారా 'స్త్రీ విముక్తి' ఆవశ్యకతను చాటారు. 16వ యేట చందమామ తొలి సంచికకు 'పొట్టి పిచిక కథ'ను పంపారు. ఆంధ్ర సాహిత్య అకాడమీ, ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, ఆంధ్ర ప్రభుత్వ తెలుగు వైభవ పురస్కారం తదితర పురస్కారాలు పొందారు. 2011 నవంబరు 28న కన్నుమూశారు.

అమీన్ సయాని (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత అమీన్ సయాని 1932 డిసెంబరు 21న బాంబేలో జన్మించారు. ఆసియా ఖండంలోనే పేరొందిన ఆలిండియా రేడియో వ్యాఖ్యాత. 'బినాకా గీత్‌మాలా' కార్యక్రమంతో పేరొందారు. 1951 నుంచి ఇంతవరకు 54వేల రేడియో కార్యక్రమాలకు, 19వేల స్పాట్స్/జింగిల్స్‌కు వ్యాఖ్యాతగా రాణించారు. 'బెహనో ఔర్ భాయియో' అంటూ శ్రోతలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగడం ప్రత్యేకత. హిందీ రత్న పురస్కార్, హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు ఇతర పురస్కారాలు పొందారు. 2024 ఫిబ్రవరి 20న కన్నుమూశారు.

కృష్ణమాచారి శ్రీకాంత్ (పుట్టినరోజు)




కృష్ణమాచారి శ్రీకాంత్ 1959 డిసెంబరు 21న మద్రాస్‌లో జన్మించారు. భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా, సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 1980 దశకంలో ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా గుర్తింపు పొందారు. సునీల్ గవాస్కర్‌తో కలసి పలు మ్యాచ్‌లు ఆడారు. 1983 వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో వెస్టిండీస్‌పై అత్యధిక స్కోరు సాధించిన క్రమంలో 1989లో భారత జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం బుల్లితెరపై వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. 2020లో ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ స్పోర్ట్స్ ప్యానెల్‌లో సభ్యుడిగా చేరారు.

కేంద్రమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నిరసన

దొమ్మసంద్ర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ దళితసంఘర్ష సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. సర్జాపుర హోబళి దొమ్మసంద్రలో అంబేడ్కర్ ఫోటోలతో ధర్నా నిర్వహించారు. సంఘం ముఖ్యుడు మునిరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆయనను వెంటనే పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దేశంలో వెనుకబడిన, దళిత వర్గాల ఉన్నతికి అంబేడ్కర్ పాటుపడ్డారన్నారు. రాజ్యాంగంలో అన్నివర్గాల వారికి హక్కులు కల్పించారన్నారు. రాజ్యాంగనిర్మాతను అవహేళన చేసేలా వ్యాఖ్యలు సరికాదన్నారు. నిరసనలో జగదీశ్, వెంకటరమణప్ప, మంజునాథ్, దళిత సంఘం మహిళా విభాగం సభ్యురాలు మంజుళమ్మ, ప్రకాశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


నిరసనలో దళిత సంఘర్ష సమితి సభ్యులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.00	1,590.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,395	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,467	1,916
నీటి నిల్వ (టీఎంసీలు)	90.35	11.43

వాహనం ఢీకొని చిరుత మృతి

బళ్లారి సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతిచెందింది. కూడ్లిగి మండల అటవీ అధికారి సందీప్‌నాయక్ తెలిపిన వివరాల మేరకు గురువారం రాత్రి విజయనగరం జిల్లా కానహొసళ్ళి సమీపంలోని అమలాపూర్ సమీపంలోని 50వ జాతీయ రహదారిపై వాహనం ఢీకొని ఆడ చిరుతపులి మృతి చెందింది. జర్మలి రిజర్వ్ ఫారెస్ట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన చిరుత.. హైవే దాటుతండగా వాహనం ఢీకొని మృతిచెందింది.

పొలాలను పరిశీలించిన అధికారులు



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

కంప్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వరి నారుమళ్లకు పట్టిన ఉల్లికోడు తెగుళ్లను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. శుక్రవారం కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం, బెళగోడుహాళ్, రామసాగర, తదితర గ్రామాలలో నది ఒడ్డున ఉండే గ్రామాలు, బోర్ల కింద నారుమళ్లను కీటక పరిశోధకుడు ఆనంద్‌కుమార్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు అందజేశారు. ఫిప్రోనిల్ 0.6 జి, ఫోరమ్‌ట్రానిల్‌ఫోల్, హేమడెక్స్ ప్లామ్ వాడినట్లయితే కొంత వరకు తెగుల్లను నివారించవచ్చని వారు తెలిపారు. వాతావరణ మార్పులతో తెగుల్లు వస్తున్నాయన్నారు. మరేగౌడ, అమరేగౌడ, వ్యవసాయాధికారి సోమశేఖర్, రామన్నగౌడ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



కళాతండ కార్యక్రమంలో గ్రామ పెద్దలు

కంప్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందుతిఃఐదుగ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దరోజీ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు గీతా గణేష్ తెలిపారు. శుక్రవారం కొత్త దరోజీ గ్రామ పంచాయతీ ఆవరణంలో సార్వజనిక సంపర్క శాఖ ఆధ్వర్యంలో చిగురు కళాతండ కార్యక్రమాన్ని ప్రారంభించి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ప్రజలకు, మహిళలకు, ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ద్వారా వచ్చే సదుపాయాలను దుర్వినియోగం చేసుకోకుండా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పీడీఓ సిద్ధలింగ స్వామి, చిగురు కళాతండ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లకు ప్రముఖుల పేర్లు

- పాలికె తీర్మానం
- అవినీతి ఆరోపణలున్న అధికారులకు ప్రమోషన్లపై బీజేపీ సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నందీష్ బాబు

బళ్లారి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కూడళ్లకు ప్రముఖుల పేర్లు పెట్టాలని మహనగర పాలికె తీర్మానించింది. మేయర్ ప్రతిపాదించిన ఈ అంశాన్ని సభ్యులు ఏకీకరించారు. శుక్రవారం బళ్లారి జడ్పీ సమావేశ భవనంలో బళ్లారి మహనగర పాలికె సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మేయర్ ముల్లంగి నందీష్‌బాబు అధ్యక్షతన వహించారు. గాంధీనగర్ బాలభారతి స్కూల్ రోడ్డకు హేమాద్రిభట్ రోడ్డు, ఇన్‌ఫాంటీరోడ్డు కు సిద్దరామేశ్వర్ సర్కిల్, మోకా- కేఈబీ సర్కిల్‌కు బసవేశ్వర సర్కిల్, ఇలా ప్రధానంగా ఉండే సర్కిళ్ల పేర్లను మార్చి ప్రముఖుల పేర్లను పెట్టాలని నిర్ణయించారు. అనంతరం ప్రతిపక్ష నాయకుడు కార్పొరేటర్ ఇబ్రహీం బాబు మాట్లాడారు. సర్కిల్‌లకు పేర్ల మార్చడంతోపాటు అక్కడ నేమ్ బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్పొరేషన్ జేసీబీలను కొందరు కార్పొరేటన్లు సొంతానికి వాడుకుంటున్నారని, వాటికి జీపీఎస్ అమర్చాలని ఆయన డిమాండ్ చేశారు. జేసీబీలు ఎక్కడ, ఏఏ పనులు చేస్తున్నాయనేది రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు.

ప్రమోషన్లపై బీజేపీ సభ్యుల ఆగ్రహం

సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయిన బీజేపీ కార్పొరేటర్లు: కార్పొరేషన్‌లో అధికారులు నకిలీ బిల్లులు సృష్టించి, రూ.కోట్లు దండుకున్నారని వాటిపై విచారణ జరిపించాలన్నారు. కొన్ని నెలల కిందట కంపెనీకి చెందిన మహ్మద్ గౌస్, మహదేవ అనే అధికారుల పై లోకాయుక్త అధికారులు దాడులు చేశారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకోకుండా వారికి ఇంజనీరింగ్ పోస్టుల్లో ప్రమోషన్ ఇచ్చారని, ఇందులో అధికార పార్టీ హస్తం ఉందని ఆరోపించారు. దీనికి నిరసనగా బీజేపీ నాయకులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లిపోయారు. బీజేపీ కార్పొరేటర్లు ఇబ్రహీం బాబు, గోవిందరాజులు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రతి సమావేశం లోనూ ప్రజాసమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఇబ్రహీం బాబు మధ్య వాగ్వాదం

మూడోరోజుకు కార్మికుల నిరసన



ఆందోళనలో కార్మికులు

బళ్లారి సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర కార్మికవర్గ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన శుక్రవారం మూడో రోజుకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసన చేపట్టి జిల్లా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కార్మిక సంఘం నాయకులు సత్యబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ పరిశ్రమల్లో లక్షలాది మంది సంఘటిత కార్మికులు, నిర్మాణ కార్మికులు, ఆటో, టాక్సీ వీధివ్యాపారులు పని చేస్తున్నారని, వారికి తగిన న్యాయం జరగడం లేదన్నారు. వివిధ విభాగాల్లో ప్రైవేట్, ప్రభుత్వ మున్సిపల్ పంచాయతీల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సరైన వేతనాలు అందడం లేదన్నారు. కర్ణాటక కార్మిక సదస్సు(కెఎల్‌సీ) ఏర్పాటు చేయాలన్న డిమండ్‌తో సహా వివిధ కార్మికవర్గాల డిమాండ్లకు తమ బడ్జెట్‌లో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బెల్ట్‌షాపులు మూసేయాలి

కంప్లి, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో బెల్టు షాపులతో అసాంఘీక కార్యకలాపాలు పెరిగిపోయాయని, వెంటనే వాటిని మూసివేయాలని గ్రామస్థులు నిరసన చేపట్టారు. శుక్రవారం హగరిబొమ్మనహళ్లి నియోజకవర్గ పరిధిలోని హరేహాళ్, రామనాయకనహళ్లి గ్రామాల్లో వుండే బెల్టుషాపులను మూసేయాలని ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ముందు గ్రామ ప్రజలు పంపన్న, సావిత్రి, నాగరాజు గంగమ్మ నిరసన చేపట్టారు. ప్రతినిత్యం కూలి చేసి సంపాదించిన డబ్బులను బెల్టుషాపులకు ఖర్చుచేస్తున్నారని, ఇప్పటికైనా వాటిని మూసివేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సైబర్ నేరాలపై అవగాహన

బళ్లారిరూరల్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. శుక్రవారం నగరంలోని జిల్లా పోలీస్ ఎస్పీ కార్యాలయం సమీపంలోని బళ్లారి కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి ఐజీ లోకేష్ కుమార్, ఎస్పీ శోభారాణి నేతృత్వంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పలు భాషల్లో ఫోన్లు చేసి మొబైల్‌కు ఓటీపీ నెంబర్ పేరుతో మోసాలకు పాల్పడుతారన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ప్రమాదాల్లో మృత్యువాత పడితే కుటుంబం రోడ్డు పాలు కాకతప్పదన్నారు. నగరంలోని కనకదుర్గమ్మ దేవస్థానం రాయల్ బెంగళూరు రోడ్డు మోతీ సర్కిల్ పలు నగర ఎన్‌సీసీ విద్యార్థులు పోలీసులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయాధికారి రాజేష్ హోసమనే, డీఎస్పీ వెంకటేష్, డీఎస్పీ తిప్పేస్వామి, ట్రాఫిక్ సీఐ అయ్యన్నగౌడ పాటిల్, సంచార పోలీస్ స్టేషన్ శశిధర్, పెద్దఎత్తున పోలీసులు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పీడీహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ నాగభూషణ నేతృత్వంలో రూపనగుడి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో పెద్దఎత్తున సైబర్ నేరాలపై గ్రామాల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



ర్యాలీలో ఎస్పీ శోభారాణి, పోలీసు అధికారులు



కంటి చికిత్స చేయించుకున్న వృద్ధులు

120 మందికి నేత్ర చికిత్స

కంప్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సండూరు పట్టణంలో కుమారగౌడ 15వ పుణ్యస్మరణ సందర్భంగా శుక్రవారం వీకేజీ ఫౌండేషన్, బళ్లారి అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం, కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీకేజీ సంస్థ ప్రముఖులు నాగన్న గౌడ మాట్లాడుతూ 65 మంది రక్తదానం చేశారని, 120 మందికి నేత్ర చికిత్సలు నిర్వహించామన్నారు. కొండ్లహళ్లి ఎంఆర్‌టీ నేత్రాలయ డాక్టర్ విజయ్‌నాగరాజు ఆధ్వర్యంలో ఈ కంటి చికిత్స జరిగినట్లు తెలిపారు. సంఘసంస్థ నేతలు గ్రామాలలో చేపట్టే ఆరోగ్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

హోసూరు జోన్

పొలాలను పాడు చేస్తున్న ఒంటరి ఏనుగు

హోసూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు పొలాల్లో సంచరిస్తూ పంటను నాశనం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోసూరు అడవుల్లో ఏనుగులు బస చేశాయని అటవీశాఖ హెచ్చరించింది. ఈ ఏనుగులను సరిహద్దులలోని కర్ణాటక రాష్ట్ర అడవుల్లోకి తరిమికొట్టేందుకు అటవీశాఖ అధికారులు ముమ్మర చర్యలు కొనసాగిస్తున్నారు. అయితే ఏనుగుల మంద రాత్రివేళల్లో పొలాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. టమోటా, రాగులు, క్యాబేజి, కీరదోస, బీన్సు ఇతర అన్ని రకాల వివిధ కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రత్యేకించి ఒంటరి ఏనుగు బోడిసిపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తూ వీరంగం సృష్టిస్తోంది. ఏనుగుల స్వైర విహారంతో రైతులు పంటలను నష్టపోతున్నారు. పశువులను మేపేందుకు సరిహద్దు ప్రాంతాల్లోకి వెళ్లరాదని ఇప్పటికే అటవీశాఖ అధికారులు హెచ్చరించడంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. సుమారు 200 ఏనుగులు వివిధ ప్రాంతాల్లో మకాం చేసినట్టు తెలుస్తోంది. ఆహారం కోసం పొలాల్లోకి చొరబడి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. వెంటనే ఏనుగులను నియంత్రించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కేంద్రమంత్రి రాజీనామా చేయాలి

హోసూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి ఆమిత్‌షా మాట్లాడుతూ అంబేడ్కర్ పేరు కాకుండా దేవుడి పేరు చెబితే అంబేడ్కర్‌ను అవమానించారని, వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. హోసూరు కార్పొరేషన్ వద్ద గాంధీ విగ్రహం సమీపాన కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. నిరసనకు విడుదల చిరుత పార్టీ శాసనసభ నియోజకవర్గ కార్యదర్శి రామచంద్రం అధ్యక్షత వహించారు. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిరసనలో నిర్వాహకులు సెంట్రల్ జిల్లా మాదేశ్, సెందమిళ్, వినోద్‌కుమార్, సూర్యవళవన్, మారప్ప, మహిళా బృందం రాసాతీ, ప్రమీళ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ ఫొటోలతో నిరసన తెలుపుతున్న విడుదల చిరుత పార్టీ కార్యకర్తలు



హోసూరు ఎంజీఆర్ కళాశాల బాలికల హాకీ టోర్నీ విజేత

హాకీ పోటీలకు 11 జట్లు

హోసూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హోసూరు ఎంజీఆర్ కళాశాల, సేలం పెరియార్ విశ్వవిద్యాలయం బాలికల అంతర్ కళాశాలల హాకీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. టోర్నమెంట్‌లో 11 జట్లు పాల్గొనగా బాలికల ధర్మపురి పద్మవాణి కళాశాల ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రథమ స్థానం పొందింది. ద్వితీయ, తృతీయ స్థానాల జట్లతోపాటు విజేత జట్లకు కళాశాల పిన్సిపాల్ ముత్తుమణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు ధనకోటి, రాజశేఖర్, బహుమతులు అందజేసి అభినందించారు. పెరియార్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకటాచలం, యూనివర్సిటీ మహిళా టీమ్ కో ఆర్డినేటర్ గోపిక తదితరులు పాల్గొన్నారు.

పార్టీ జెండా అవిష్కరణ రద్దు

హోసూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని రాయకోట రోడ్డు అశోక్‌పిల్లర్ సర్కిల్ వద్ద ఉదయం 11.30 గంటలకు పశ్చిమ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ జెండాను అవిష్కరించే ఏర్పాట్లు చేశారు. తళి శాసనసభ నియోజకవర్గంలో బీజేపీ తరపున గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి రామచంద్రన్ అకస్మాత్తుగా మృతి చెందారనే సమాచారంతో కార్యక్రమాన్ని రద్దు చేశారు. హోసూరు సమీపంలోని కసువుగట్ట ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాల కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అణ్ణామలై శుక్రవారం పాల్గొని అనంతరం రాయకోట రోడ్డు ప్రాంతానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న అణ్ణామలై మాట్లాడుతూ నిష్ఠావంతులైన కార్యకర్త మృతి నేపథ్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. తదుపరి ఆయన కోయంబత్తూరుకు బయల్దేరారు.

వ్యాక్సిన్‌తో రేబిస్‌కు చెక్

సిరుగుప్ప, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కుక్క కరిస్తే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలని, దీంతో రేబిస్‌కు చెక్ పెట్టవచ్చని వైద్యులు మహమ్మద్ ఖాసీమ్ సూచించారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం 7,8వ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వాస్పత్రి, వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసీమ్ మాట్లాడుతూ కుక్క కరచినప్పుడు గాయాన్న కడిగి ప్రథమ చికిత్స నిర్వహించాలన్నారు. తాలుకాలో అన్ని ప్రభుత్వాస్పత్రులలో రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా లభిస్తోందన్నారు. ఇళ్లల్లో వుండే కుక్కలతో ఎక్కువగా అలుసుగా వుండరాదని ఆయన తెలిపారు. జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సత్యప్ప, లింగన్న, ఈరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై అధికారులు కొరడా...!

- ఐదు క్లినిక్‌ల సీజ్
- ఫిర్యాదు చేసినపుడే హడావుడి..
- చర్యలు శూన్యమంటూ గ్రామస్థుల ఆగ్రహం



నకిలీ క్లినిక్ సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

బళ్లారి గాంధీనగర్/రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, అరకొర జ్ఞానంతో వైద్యం అందిస్తున్న క్లీనిక్‌లపై జిల్లా వైద్యశాఖ అధికారులు శుక్రవారం కొరడా ఝులిపించారు. బళ్లారి నగరంతో పాటు చుట్టుప్రక్కల పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఐదు నకిలీ క్లినిక్‌లను సీజ్ చేశారు. బళ్లారి రూరల్ పరిధిలోని కప్పగల్ గ్రామంలో రాజన్న క్లినిక్, షెక్షావలీ క్లినిక్, రెహమాన్ క్లినిక్, మహమ్మద్ క్లినిక్, గురు క్లినిక్‌లను ఆరోగ్యాధికారులు సీజ్ చేశారు. సరైన అర్హత లేకున్నా వీటిని నిర్వహించడం గమనార్హం. తాలూకా వైద్యాధికారి డాక్టర్ ఆర్.అబ్దుల్లా ఆధ్వర్యంలో సిబ్బంది కప్పగల్లు గ్రామం బళ్లారి నగర పరిధిలోని ఐదు క్లినిక్‌లను సీజ్ చేశారు. గ్రామంలో వైద్యం వృత్తి చేస్తున్నట్లు కనిపిస్తే వెంటనే జిల్లా ఆరోగ్య శాఖ అధికారులకు తెలియజేయాలని డీహెచ్‌ఓ డాక్టర్ యల్లా రమేష్‌బాబు సూచించారు.

సీజ్ అంతా బూటకమే...

అయితే క్లినిక్‌ల సీజ్‌పై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ వైద్యులపై జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు కొరఢా ఝులిపించడం హాస్యాస్పదంగా అనిపిస్తోంది. సమస్య ఈ రోజుది కాదని, కొన్నేళ్ళుగా తంతు నడుస్తున్నా, అధికారులు ఇప్పుడు హడావుడి చేస్తున్నారని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ తతంగం అంతా జిల్లా, తాలూకా వైద్యాధికారులకు తెలిసే జరుగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం అంతా భూటకమేనని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎవరో ఫిర్యాదు చేస్తే... విషయం తెలుసుకుని క్లినిక్‌లు సీజ్ చేయడం కాదని, నకిలీ వైద్యులపై కఠినచర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దాడి విషయం నకిలీ వైద్యులకు ముందే చేరవేసి... ఖాళీగా ఉన్న క్లినిక్‌లు సీజ్ చేయడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు



వేషధారణలో చిన్నారులు

గంగావతి రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. శుక్రవారం గంగావతి పట్టణంలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు వేషాలు వేసి ఏసుక్రీస్తు వృత్తాంతాన్ని ప్రదర్శించారు. ఏసుక్రీస్తు లోక రక్షణకు జన్మించారని సందేశాన్ని ఇచ్చారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజును పవిత్రంగా ప్రపంచమంతా క్రిస్మస్ పండుగగా ఆచరిస్తున్నట్లు సెయింట్ పాల్స్ పాఠశాల ముఖ్యోపాధ్యారాలు సర్వేస్ వస్త్రద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం హర్షణీయం

- జిల్లా సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేష్ హొసమనె

బళ్లారి సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది బళ్లారి, విజయనగరం జిల్లా వినియోగదారుల ఫోరంలోని 31కోర్టుల్లో నాలుగు విడతలుగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజవంతం అయ్యిందని జిల్లా సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె అన్నారు. శుక్రవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ శాంతి మార్గదర్శకత్వం , నాయకత్వంలో జిల్లాలోని అన్ని న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజా ప్రభుత్వ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, చెక్కు కేసులు, మనీ రికవరీ కేసులు, విభజన కేసులు, మ్యాట్రిమోనియల్ ఫ్యామిలీ కేసులు, మోటారు వాహనాల కేసులు, సివిల్ కేసులు పరిష్కరించబడ్డాయన్నారు. కేసుల పరిష్కారంతో సమాజంలో శాంతి వాతావరణం నెలకొంటుంది. ఇది సామరస్యపూర్వకమైన జీవితం, సహజీవనానికి సహాయపడుతుందన్నారు.

చిన్నారుల్లో ప్రతిభను వెలికితీయాలి



జ్యోతివెలిగించి కార్యాక్రమాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ ఫ్రాన్సిస్

బళ్లారి సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిభా కారంజి, కళోత్సవ వంటి కార్యక్రమాలు దోహదపడుతాయని సంత్ జనర విద్యార్థి శిక్షణ మేనేజర్ ఫాదర్ ఫ్రాన్సిస్ అన్నారు. నగరంలోని కోటి ప్రాంతంలోని సంతజన్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం జిల్లా పరిపాలన, జిల్లాపంచాయతీ, ప్రభుత్వ విద్యాశాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ప్రతిభా కారంజీ కళాత్సోవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలందరూ సమర్థులేనని, అందరిలోనూ ప్రతిభ దాగి ఉంటుందన్నారు. వారిని గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించా లన్నారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఉమాదేవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పాఠ్యేతర కార్యక్రమాలపై ఉపాధ్యాయులు పెద్దపీట వేయాలన్నారు. డైట్ డిప్యూటీ డైరెక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ బాల్యంలోనే ప్రతిభ రాణిస్తుందని, దానిని వెలికితీయాలన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి వీరేశప్ప, శాంతజనర హైస్కూల్ ప్రిన్సిపాల్ శాంతుశీలన్, డైట్ లెక్చరర్లు, జిల్లాస్థాయి ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, అన్‌ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్



గడిగి చెన్నప్ప సర్కిల్ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బళ్లారి సిటీ, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను కించపరిచేలా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని గడిగిచెన్నప్ప సర్కిల్లో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ ఆధ్వర్యంలో లిడ్కర్ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజు, కార్పోరేషన్ సభ్యుడు పి.గాదెప్ప,నాయకులు శివరాజ్ హెగ్డే, అల్లీపురం వెంకటస్వామి తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కించపరచిన అమిత్‌షా ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలన్నారు. రాజాంగనిర్మాత అంబేడ్కర్‌ని అవమానించడం, పార్లమెంట్‌లో ఎద్దేవా చేయడం సరికాదన్నారు. వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ తక్షణమే ఆయన రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.